ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 తమిళనాడు
TAMILNADU
సోమవారం 12 ఫిబ్రవరి 2024

పీఎంకే, డీఎండీకేతో పొత్తుకు బీజేపీ తహతహ!

● నేతల నడుమ రహస్య మంతనాలు

చెన్నై, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో మెగా కూటమి ఏర్పాటు కోసం అటు అన్నాడీఎంకే, ఇటు బీజేపీ తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నాయి. పాట్టాలిమక్కల్ కట్చి (పీఎంకే), దేశియ ముర్పోక్కు ద్రావిడ కళగం (డీఎండీకే) పొత్తు కుదుర్చుకునేందుకు తహతహలాడుతున్నాయి. అదే సమయంలో బీజేపీ ఈ రెండు పార్టీలపై గాలం విసురుతోంది. డీఎండీకే చీఫ్ విజయకాంత్ మృతి తర్వాత ఆ పార్టీ వ్యవహారాలను ఆయన సతీమణి ప్రేమలత చూస్తున్నారు. ఇప్పటికే ఆమె బీజేపీ జాతీయ నాయకులతో మంతనాలు జరిపి పదికిపైగా లోక్‌సభ స్థానాలు, రాజ్యసభ సీటు కేటాయించాలని డిమాండ్ చేశారని వార్తలు వెలువడ్డాయి. గత శాసనసభ ఎన్నికల్లో అన్నాడీఎంకే కూటమిలో బీజేపీ, పీఎంకే, డీఎండీకే మిత్రపక్షాలుగా ఉండేవి. ప్రస్తుతం బీజేపీతో అన్నాడీఎంకే తెగతెంపులు చేసుకుంది. దీంతో పీఎంకే, డీఎండీకేలను ఎలాగైనా కూటమిలో చేర్చుకోవాలని బీజేపీ నాయకులు ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నారు. అదే సమయంలో అన్నాడీఎంకే కూడా పీఎంకే నేతలతో మంతనాలు జరిపింది. ఆ పార్టీకి చెందిన మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యుడు సీవీ షణ్ముగం ఇటీవల దిండివనం తైలాపురం గార్డెన్‌లో పీఎంకే వ్యవస్థాపక నేత రాందాస్‌ను కలుసుకుని చర్చలు జరిపారు. ఈ విషయం వెలుగు చూడగానే బీజేపీ జాతీయ కమిటీ నేతులు పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రాందాస్‌తో ఫోన్‌లో సంభాషించి తమ కూటమిలో చేరాలంటూ ఒత్తిడి చేసినట్లు తెలుస్తోంది.

పీఎంకే ఓటు బ్యాంకు...

పీఎంకేకు ప్రత్యేక ఓటు బ్యాంకున్న శ్రీపెరుంబుదూరు, ఆరణి, మైలాడుదురై, ధర్మపురి, విల్లుపురం, కాంచీపురం స్థానాలను కేటాయించేందుకు బీజేపీ నేతలు అంగీకరించినట్లు చెబుతున్నారు. ఆ కారణంగానే అన్బుమణి రాందాస్ లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ సీట్లలో తమ పార్టీ గెలుస్తుందంటూ పలు సభల్లో పదే పదే ప్రస్తావిస్తున్నారు. అన్నాడీఎంకే ఇవ్వజూపుతున్న ఏడు లోక్‌సభ స్థానాలు, రాజ్యసభ సీటు కంటే ఎక్కువ సీట్లు కేటాయిస్తామంటూ బీజేపీ జాతీయ నాయకులు పీఎంకేకు ఆశచూపుతున్నారు. అయితే పీఎంకే నేతలు 12 లోక్‌సభ సీట్లిస్తేనే కూటమిలో చేరుతామంటూ మెలిక పెడుతున్నారని బీజేపీ నేతలు చెబుతున్నారు. ఇక డీఎండీకే కూడా బీజేపీ వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. డీఎండీకే నేత విజయకాంత్ మృతికి ప్రధాని నరేంద్రమోదీ సంతాపం వ్యక్తం చేసిన తీరుపట్ల ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత హర్షం ప్రకటించారు. ఆ సమయంలోనే రెండు పార్టీల నడుమ సఖ్యత కుదిరినట్లు చెబుతున్నారు. రాబోయే ఎన్నికల్లో జాతీయ స్థాయిలో బీజేపీ కూటమి ఘనవిజయం సాధిస్తుందని సర్వేలు చెబుతుండటంతో గెలుపునకు అవకాశం ఉన్న ఆ పార్టీతో పొత్తుపెట్టుకోవడమే శ్రేయస్కరమని ప్రేమలత భావిస్తున్నారు. బీజేపీ అధిష్ఠానం కూడా ఈ రెండు పార్టీలతో అధికారిక చర్చలు జరిపేందుకు సిద్ధమవుతోంది. వచ్చేవారం పీఎంకే నేతలతో బీజేపీ నేతలు చర్చలు జరుపనున్నారని, ఆ తర్వాత డీఎండీకే నేతలతో మంతనాలు జరుపుతారని తెలుస్తోంది.

నేటినుంచి అసెంబ్లీ సమావేశాలు

● గవర్నర్ ప్రసంగంతో ప్రారంభం


శాసనసభ సమావేశాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న స్పీకర్ అప్పావు

చెన్నై, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ సమావేశాలు ఈనెల 12న సోమవారం ఉదయం ప్రారంభం కానున్నాయి. ఈ యేడాది తొలి సమావేశాలు కావడంతో గవర్నర్ ఆర్ఎన్ రవి ప్రసంగించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వచ్చే రెండేళ్లలో అమలు చేయనున్న కొత్త పథకాలు, ఇటీవల రాష్ట్రంలో పెరిగిన పారిశ్రామిక పెట్టుబడులు తదితర కీలకమైన అంశాల ప్రస్తావనలు గవర్నర్ ప్రసంగంలో చోటుచేసుకోనున్నాయి. ఇటీవలే స్పీకర్ అప్పావు రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలుసుకుని అసెంబ్లీ సమావేశంలో పాల్గొని ప్రసంగించాల్సిందిగా ఆహ్వానించారు. ఈ సమావేశాలు సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయి. శాసనసభలో ప్రసంగించేందుకు రాష్ట్ర గవర్నర్ ఉదయం 9.57 గంటలకు సచివాలయ ప్రాంగణానికి చేరుకుంటారు. ప్రవేశద్వారం వద్ద స్పీకర్ అప్పావు, శాసనసభ కార్యదర్శి శీనివాసన్ తదితరులు స్వాగతం పలకనున్నారు. ఆ సందర్భంగా పోలీసుల గౌరవ వందనాన్ని గవర్నర్ స్వీకరించనున్నారు. స్పీకర్ పోడియం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కుర్చీలో గవర్నర్ ఆశీనులవుతారు. తమిళ తల్లి ప్రార్థనగీతాలాపన తర్వాత గవర్నర్ ఆంగ్లంలో ప్రసంగించనున్నారు. అటుపిమ్మట స్పీకర్ అప్పావు గవర్నర్ ఆంగ్ల ప్రసంగం తమిళ అనువాదాన్ని పఠించనున్నారు. చివరగా జాతీయ గీతాలాపన తర్వాత సభ ముగియనుంది. స్పీకర్ అప్పావు, కార్యదర్శి కలిసి గవర్నర్‌కు వీడ్కోలు పలుకనున్నారు. గవర్నర్ ప్రసంగాన్ని దూరదర్శన్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు.

సభావ్యవహారాల మండలి సమావేశం...

శాసనసభ సమావేశం ముగియగానే స్పీకర్ ఛాంబర్‌లో సభా వ్యవహార మండలి సభ్యులు సమావేశమవుతారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై, శాసనసభ సమావేశాలను ఎన్ని రోజులపాటు నిర్వహించాలనే విషయంపై నిర్ణయం తీసుకుంటారు. సమావేశం ముగియగానే శాసనసభ సమావేశాలు ఎన్నిరోజులు జరుగుతుందనే విషయాన్ని స్పీకర్ అధికారికంగా ప్రకటిస్తారు. అటు పిమ్మట ఈనెల 19న వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు దాఖలు చేయనున్నారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో గవర్నర్ ప్రసంగంలో ప్రజాకర్షణ పథకాలకు సంబంధించిన ప్రకటనలు ఉంటాయని తెలుస్తోంది.

జిల్లాల వారీగా డీఎంకే వార్ రూంలు

● ఎన్నికల పనుల సమన్వయం కోసం కమిటీలు ● పనులను వేగవంతం చేసిన డీఎంకే

అడయార్, ఫిబ్రవరి 11: త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల కోసం తమిళనాడులో 39 సీట్లు, పుదుచ్చేరిలోని సీటుతో కలుపుకుని మొత్తం 40 సీట్లలో గెలుపే లక్ష్యంగా అధికార డీఎంకే చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లాల వారీగా వార్ రూంలను ఏర్పాటు చేసింది. అలాగే, ఎన్నికల పనులను సమన్వయం చేసేందుకు వివిధ విభాగాల కమిటీలను ఏర్పాటు చేసింది. క్షేత్రస్థాయి పరిస్థితులతో పాటు సమస్యల వివరాలను పార్టీ శ్రేణులు తొలుత సేకరించి జిల్లా వార్ రూంలకు చేరవేస్తారు. అక్కడ నుంచి పార్టీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసి ప్రధాన వార్ రూంకు సమాచారం అందిస్తారు. ఈ సమాచారాన్ని క్షుణ్ణంగా విశ్లేషించి, కింది స్థాయికి సూచనలు, సలహాలు ఇస్తారు. అంతేకాకుండా, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమ్యల పరిష్కారం కోసం ప్రత్యేక న్యాయవాద కమిటీలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఆయా నియోజకవర్గాల్లోని సామాజిక, నైసర్గిక స్థితిగతులు, సమస్యలు ఇలా ప్రతి అంశంపై సమాచారాన్ని సేకరిస్తారు. ఆ ప్రకారంగా డీఎంకే అధిష్ఠానం ఎన్నికల పనులు చేపట్టి, అభ్యర్థుల విజయానికి చర్యలు తీసుకోనుంది. కాగా, ఇప్పటికే మీడియా డిబేట్లు, స్టార్ క్యాంపెయినర్లు, ప్రచారాంశాల పనుల పర్యవేక్షణ కోసం పార్టీ డిప్యూటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆస్టిన్, న్యాయ కమిటీలు, ఎన్నికల సంఘం తదితర పనులను పర్యవేక్షించేందుకు ఇన్‌చార్జిగా డీఎంకే న్యాయ విభాగం కార్యదర్శి, ఎంపీ ఎన్.ఆర్.ఇళంగోను నియమించారు. పార్టీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన వార్ రూంకు సమాచారాన్ని చేరవేసేందుకు 08069446900 అనే వాట్సాప్ నెంబరును అందుబాటులోకి తెచ్చారు. వార్ రూంలలో పనులను సమన్వయం చేసేందుకు సమన్వయ కమిటీలను కూడా ఏర్పాటు చేశారు.

వార్ రూంలు అంటే?

వార్ రూం అంటే నియోజకవర్గంలోని ప్రజల మనోభావాలను తెలుసుకోవడం, ఓటర్ల బాధ్యతలు, నియోజకవర్గంలోని సామాజిక స్థితిగతులు, పోటీకి దింపే అభ్యర్థి ఎలా ఉండాలి? ఎలాంటి అర్హతలు కలిగి ఉండాలి? వంటి అంశాలను విశ్లేషించి ప్రధాన వార్‌రూంకు చేరవేస్తారు. అలాగే, ప్రచార వాల్‌పోస్టర్లు, కరపత్రాలు ఎలా ఉండాలి అనే అంశాన్ని కూడా వార్ రూంలో నిర్ణయిస్తారు. అలాగే, ఒక అంశాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేసి, దాన్ని ట్రెండింగ్ చేయడం కూడా ఈ వార్ రూం సిబ్బంది విధి . ప్రతిపక్ష నేతలు చేసే ప్రతి విమర్శకు ప్రధాన వార్ రూంలో ఉండే వారే ఈ ప్రతిస్పందిస్తారు. అలాగే, ప్రతిపక్ష నేతల వ్యూహాలను పసిగట్టి, వారికి దీటుగా ఎలా పనిచేయాలో ఇక్కడి నుంచే సూచనలు, సలహాలు అందిస్తారు.

జాలర్లపై దాడులను అడ్డుకోండి

● కేంద్రానికి వ్యతిరేకంగా డీఎంకే ఆందోళన

అడయార్, ఫిబ్రవరి 11: రాష్ట్రానికి చెందిన జాలర్లపై శ్రీలంక నావికాదళం జరుపుతున్న దాడులకు అడ్డుకోవాలని కోరుతూ రామనాథపురం జిల్లా రామేశ్వరంలో డీఎంకే ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళన జరిగింది. ఇందులో వేలాది మంది ప్రజలు పాల్గొని కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గత 2018 నుంచి ఇప్పటివరకు శ్రీలంక నావికాదళం స్వాధీనం చేసుకున్న 150కి పైగా పడవలు ఇప్పటివరకు విడిపించలేదని, వాటిని తక్షణం విడిపించాలని డిమాండ్ చేశారు. ఇక రాష్ట్రానికి చెందిన జాలర్లపై లంక నావికాదళం జరుపుతున్న దాడులను అడ్డుకోవాలని కోరుతూ ఈ ఆందోళనలో పాల్గొన్న నేతలు డిమాండ్ చేశారు.

రామేశ్వరంలో జాలర్లకు మద్దతుగా నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న డీఎంకే కూటమి నేతలు, కార్యకర్తలు



మాట్లాడుతున్న విల్సన్

విద్యార్థుల ప్రాణాలు తీస్తున్న 'నీట్'

● రాజ్యసభలో డీఎంకే ఎంపీ విల్సన్ ఆవేదన

ప్యారీస్, ఫిబ్రవరి 11: వైద్య విద్యా స్థాయిని పెంచే ముసుగులో కేంద్ర ప్రభుత్వం పరిచయం చేసిన 'నీట్' తమిళనాడులో 16 మంది విద్యార్థులను బలిగొందని డీఎంకే రాజ్యసభ సభ్యుడు విల్సన్ పార్లమెంటు సమావేశాల్లో ప్రస్తావించారు. రాజ్యసభలో శనివారం జరిగిన సమావేశంలో డీఎంకే ఎంపీ విల్సన్.. పబ్లిక్, పోటీ పరీక్షల విధానాలకు సంబంధించిన చర్చలో పాల్గొని మాట్లాడారు. వృత్తి విద్యా కోర్సుల్లో చేరేందుకు ప్రవేశ పరీక్షలు నిర్వహించాల్సిన ఆవశ్యకత లేదని, పరీక్షలు కఠినంగా ఉంటే విద్యార్థులు మనోవేదనకు గురవుతుంటారని, అందువల్ల వెనుకబడిన వర్గాలకు చెందిన ప్రజలు విశ్వవిద్యాలయాల్లో కాలు మోపేందుకు అవకాశం లేకుండా పోతోందని భారత రాజ్యాంగ నిర్మాణ శిల్పి డాక్టర్ అంబేడ్కర్ పలు సందర్భాల్లో పేర్కొన్నారని ఆయన సభకు గుర్తు చేశారు. నీట్ కు సిద్ధపడుతున్న విద్యార్థులు ప్రస్తుతం ఆ పరీక్ష అంటేనే బెంబేలెత్తి పోతున్నారని, ఈ పరీక్షల వల్ల తమిళనాడులో 16 మంది విద్యార్థులు బలైపోయారని, ఇలాంటి మరణాలు పునరావృత్తం కారాదన్న దృష్టితోనే తమ రాష్ట్రానికి ఈ పరీక్ష నుంచి మినహాయింపు కోరుతున్నామని తెలిపారు. వైద్యులు కావాలన్న విద్యార్థుల ఆకాంక్షను కొన్ని ప్రైవేటు విద్యాసంస్థలు తమకు సాధకంగా తీసుకొని నీట్ శిక్షణ కేంద్రాలను వ్యాపారసంస్థలుగా మార్చాయని తెలిపారు. తమిళనాడు అసెంబ్లీలో నీట్ మినహాయింపు పొందేందుకు 2022వ సంవత్సరం ఆమోదించిన తీర్మానాన్ని రాష్ట్రపతి అనుమతి కోసం పంపించామని, అయితే దానిపై ఇప్పటివరకు చర్యలు లేవన్నారు. పార్లమెంటులో తాను ఈనెల 6వ తేది ప్రశ్న నెం.405 కింద నీట్ మినహాయింపు బిల్లు పరిస్థితి ఎలా ఉందని ప్రశ్నించానని, దానికి సంబంధిత మంత్రి కూడా ఎలాంటి సమాధానం చెప్పకపోవడం ఆందోళన కలిగించిందన్నారు. సభ్యులు అడిగే ప్రశ్నలకు సంబంధిత శాఖల మంత్రులు సమాధానం చెప్పకుండా దాటవేయడం సరికాదని, అలాంటప్పుడు విద్యార్థులు మాత్రమే ప్రశ్నలకు ఎలా సమాధానం రాస్తారని ఎదురుచూడడం భావ్యం కాదని ఎంపీ విల్సన్ వ్యాఖ్యానించారు.

డీఎంకే పాలనలో ప్రజాస్వామ్యానికి తావులేదు

● బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా ధ్వజం


ప్రజలకు అభివాదం చేస్తున్న నడ్డా, అన్నామలై, మురుగన్

ప్యారీస్, ఫిబ్రవరి 11 : రాష్ట్రంలో డీఎంకే పాలనలో ప్రజాస్వామ్యానికి తావులేదని, రోజురోజుకూ అవినీతి అక్రమాలు అధికమవుతున్నాయని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ధ్వజమెత్తారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై గత యేడాది జూలై 28న కన్నియాకుమారిలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సమక్షంలో ఎన్ మన్... ఎన్ మక్కళ్ పేరుతో పాదయాత్ర చేపట్టిన విషయం తెలిసిందే. ఈ యాత్ర పలు జిల్లాల మీదుగా సాగి రాజధాని నగరం చెన్నై చేరుకుంది. ఈ సందర్భంగా రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో మింట్ బస్టాండు కూడలి వద్ద ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో నడ్డా పాల్గొని ప్రసంగించారు.

కుంటుపడిన రాష్ట్రాభివృద్ధి...

సభలో నడ్డా మాట్లాడుతూ... డీఎంకే నిర్లక్ష్య పాలన వల్ల రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందని, అన్ని వర్గాల ప్రజలకు ఎలాంటి మేలు జరగలేదన్నారు. ఈ సభకు తాను నడిచి వస్తుండగా షావుకారుపేట, మింట్ ప్రాంతాల్లో వీధి దీపాలను ఆర్పివేసి, దుకాణాలు మూసివేశారని, ఈ పరిస్థితిని చూస్తే ఎమర్జెన్సీ తలపించిందని మండిపడ్డారు. ప్రధాని నరేంద్రమోదీకి తమిళనాడు అంటే అత్యంత ప్రీతి అని అందువల్లే ఆయన కొత్త పార్లమెంట్ భవనంలో సెంగోల్‌ను ప్రతిష్ఠించి తమిళులకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారన్నారు. అంతేకాకుండా ఆయన చేపట్టే విదేశీ పర్యటనల్లో కూడా తమిళ భాష, సంస్కృతి విశిష్టతలను మాట్లాడుతుంటారని పేర్కొన్నారు. అయితే ద్రావిడ తరహా పాలన అంటూ గొప్పలు చెప్పుకుంటున్న రాష్ట్రంలోని డీఎంకే నేతలు తమిళభాషకు, తమిళులకు ఎలాంటి న్యాయం చేయకుండా కుటుంబ రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. అన్నామలై యాత్ర వల్ల రాష్ట్ర రాజకీయాల్లో తప్పకుండా మార్పులు వస్తాయని, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ కూటమి విజయం సాధించడం తథ్యమన్నారు.

400 స్థానాల్లో విజయం...

అనంతరం కేంద్ర మంత్రి ఎల్ మురుగన్ మాట్లాడుతూ... లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బీజేపీ 400 స్థానాల్లో గెలిచి ముచ్చటగా మూడోసారి ప్రదానిగా నరేంద్రమోదీ బాధ్యతలు చేపట్టడం ఖాయమని, దీన్ని ఎవరూ అడ్డుకోలేరన్నారు. ఇండియా కూటమిలో అభిప్రాయబేధాల వల్ల అది ముక్కలవుతోందన్నారు. ప్రధాని మోదీ ప్రపంచ నాయకుడిగా గుర్తింపు పొందారని, అయోధ్య రామాలయ నిర్మాణం తర్వాత ఆయనకు ప్రజల మద్దతు రెండింతలు పెరిగిందన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై మాట్లాడుతూ తాను చేపట్టిన పాదయాత్రను అడ్డుకోవడానికి డీఎంకే ప్రభుత్వం పలు విధాలుగా కుట్ర పన్నిందని, అయినా తాను ఏకాగ్రతతో లక్ష్యం సాధించగలిగానని చెప్పారు. చెన్నైలోని మూడు లోక్‌సభ స్థానాల్లో బీజేపీ గెలుస్తుందని, కేంద్రప్రభుత్వ పథకాలపై ప్రచారాన్ని మరింత తీవ్రస్థాయిలో ప్రచారం చేస్తామన్నారు. చెన్నైని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దటమే తమ లక్ష్యమని ఈ అవకాశాన్ని ప్రజలే తమకు ఇవ్వాలని అన్నామలై పిలుపునిచ్చారు. ఈ సభలో బీజేపీ సీనియర్ నేతలు పొన్ రాధాకృష్ణన్, హెచ్ రాజా, న్యాయవాది వి.గిరినాథ్, శాసనసభ్యుడు నయినార్ నాగేంద్రన్, మహిళా, యువజన, విద్యార్థి, న్యాయవాదుల విభాగాలకు చెందిన నిర్వాహకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నడ్డాకు ఘనస్వాగతం...

ఒక రోజు పర్యటన నిమిత్తం నగరానికి విచ్చేసిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు ఆ పార్టీ శ్రేణులు అడుగడుగునా ఘనస్వాగతం పలికారు. ఆదివారం సాయంత్రం ప్రత్యేక విమానంలో వచ్చిన నడ్డాకు విమానాశ్రయం వద్ద అన్నామలై, మురుగన్ తదితర నాయకులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అక్కడి నుండి బయలుదేరి షావుకారుపేట మింట్ వీధిలో ఉన్న సుప్రసిద్ధ శ్రీరామాలయాన్ని ఆయన సందర్శించారు. ఆ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

ఏప్రిల్‌లోగా ముడిచ్చూరు ఆమ్నీ బస్టాండు

● మంత్రి పీకే శేఖర్‌బాబు

చెన్నై, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆమ్నీ బస్సుల కోసం ముడిచ్చూరు వద్ద నిర్మించే బస్టాండు ఏప్రిల్‌లోగా అందుబాటులోకి వస్తుందని సీఎండీఏ ఛైర్మన్, దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. ఆదివారం ఉదయం ఆయన రాష్ట్ర రవాణాశాఖ మంత్రి శివశంకర్‌తో కలిసి కీలంబాక్కం బస్‌టెర్మినల్ ప్రాంతాన్ని, ఆ తర్వాత ముడిచ్చూరు వద్ద ఆమ్నీ బస్సుల కోసం ఎంపిక చేసిన బస్టాండు ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. కీలంబాక్కం బస్‌టెర్మినల్ వద్దనే ఆమ్నీ బస్సులను నడపాలని ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. కానీ ఆమ్నీ బస్సులు నిలిపేందుకు కీలంబాక్కం బస్‌టెర్మినల్ వద్ద అనువైన వసతులు లేవని అక్కడి నుండి బస్సులు నడిపేందుకు నిరాకరించారు. చివరకు హైకోర్టును ఆశ్రయించి కోయంబేడు నుంచే బస్సులు నడిపేలా ఉత్తర్వు పొందారు. ఈ నేపథ్యంలో తాంబరం ముడిచ్చూరు వద్ద ఆమ్నీ బస్సుల కోసం నిర్మిస్తున్న బస్టాండు ప్రాంతాన్ని మంత్రులు పరిశీలించారు. ఆ సందర్భంగా శేఖర్‌బాబు మీడియాతో మాట్లాడుతూ... కీలంబాక్కం బస్‌టెర్మినల్ వద్ద ప్రయాణికుల అవసరమైన సదుపాయాలను దశలవారీగా కల్పిస్తున్నట్లు తెలిపారు. అదే సమయంలో ముడిచ్చూరు వద్ద ఐదెకరాల్లో ఆమ్నీ బస్సుల బస్టాండు నిర్మాణ పనులు జరుగుతున్నాయని, 300 బస్సులు నిలిపేందుకు అవకాశం ఉందని, ఇక ఆమ్నీ బస్సులు సిబ్బంది బస కోసం భవన సముదాయాన్ని కూడా నిర్మించనున్నామని ఆయన చెప్పారు. ఏప్రిల్ నెలాఖరులోగా ముడిచ్చూరు ఆమ్నీ బస్టాండు అందుబాటులోకి వస్తుందని మంత్రి శేఖర్‌బాబు తెలిపారు.


బస్టాండు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రులు, అధికారులు

సమాచార దర్శిని

నేడు ప్లస్‌టూ ప్రాక్టికల్ పరీక్షలు

పెరంబూర్, ఫిబ్రవరి 11: ప్లస్ టూ విద్యార్థులకు ఈనెల 12న సోమవారం నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో టెన్త్, ప్లస్ వన్, ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలు మార్చి 1 నుంచి ఏప్రిల్ 8వ తేది వరకు జరుగనున్నాయి. పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లను ప్రభుత్వ పరీక్ష శాఖ పూర్తి చేసింది. ఈనెల 17వ తేది వరకు జరగనున్న ప్రాక్టికల్స్‌కు రాష్ట్రవ్యాప్తంగా 5,000కు పైగా మహోన్నత పాఠశాలలో చదువుతున్న సుమారు 6 లక్షల మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఈ పరీక్షల కోసం అన్ని పాఠశాలల్లో ల్యాబ్‌లు సిద్ధం చేశారు. ఒక్కో విడతకు 25 నుంచి 30 మంది విద్యార్థులను మాత్రమే అనుమతించనున్నారు. ప్రాక్టికల్స్‌లో ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా హెచ్‌ఎంలు చర్యలు చేపట్టాలని ప్రభుత్వ పరీక్ష శాఖ ఉత్తర్వులు జారీ చేసింది

అన్నా ఫ్లై ఓవర్ మార్గంలో ట్రాఫిక్ మార్పులు

పెరంబూర్, ఫిబ్రవరి 11: నగరంలో జరుగుతున్న రెండో విడత మెట్రోరైలు పథకంలో అన్నా ఫ్లైవర్ స్టేషన్, నుంగంబాక్కం మెట్రోస్టేషన్, స్టెర్లింగ్ రోడ్డు మెట్రోస్టేషన్ నిర్మాణ పనులు జరగనున్న నేపథ్యంలో, అన్నా ఫ్లైఓవర్ మార్గంలో ఆదివారం నుంచి వారం రోజులు ట్రాఫిక్ మార్పులు చేపట్టినట్లు నగర పోలీసు శాఖ తెలిపింది.

● చెట్‌పెట్ నుంచి జెమిని ఫ్లైఓవర్ వైపుకు వెళ్లే వాహనాలు కాలేజీ రోడ్డు, హాడోస్ రోడ్డు, ఉత్తమర్ గాంధీ రోడ్డు మీదుగా జెమిని ఫ్లైఓవర్ చేరుకోవాలి. (ఈ మార్పు వన్‌వేగా ఉంటుంది)

● అలాగే, జెమిని ఫ్లైఓవర్ నుంచి వచ్చే వాహనాలు ఉత్తమర్ గాంధీ రోడ్డు, కోడంబాక్కం హైరోడ్డు (డాక్టర్ ఎంజీఆర్ రోడ్డు), వళ్లువర్‌కోట్టం మీదుగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చు.

● అలాగే, అమింజికరై వైపు వెళ్లే వాహనాలు ట్యాంక్ బండ్ రోడ్డులో ఎడమ వైపు తిరిగి నెల్సన్ మాణిక్యం మీదుగా అమింజికరై, ఇతర ప్రాంతాలకు చేరుకోవచ్చు. (ఈ మార్గం వన్‌వేగా ఉంటుంది)

● వళ్లువర్‌కోట్టం నుంచి జెమిని ఫ్లైఓవర్ వైపునకు వెళ్లే వాహనాలు వళ్లువర్‌కోట్టం హైరోడ్డు, ఉత్తమర్ గాంధీ రోడ్డు మీదుగా అన్నా ఫ్లైఓవర్ (జెమిని ఫ్లైవర్) చేరుకోవచ్చు. అలాగే, వళ్లువర్‌కోట్టంలో యూటర్న్ తీసుకొని తిరుమలైపిళ్లై రోడ్డు, జీఎన్ చెట్టి రోడ్డు మీదుగా అన్నా ఫ్లైఓవర్ చేరుకోవచ్చు.

సహకార బ్యాంక్ విద్యా రుణం రూ.5 లక్షలకు పెంపు

పెరంబూర్, ఫిబ్రవరి 11: సహకార సంస్థలు అందిస్తున్న విద్యా రుణం గరిష్ఠంగా రూ.5 లక్షలకు పెంచుతూ సహకార సంఘాల రిజిస్ట్రార్ ఎన్.సుబ్బయన్ ఉత్తర్వులు జారీ చేశారు. సహకార శాఖ పరిధిలోని రాష్ట్ర ప్రధాన సహకార బ్యాంకు, కేంద్ర సహకార బ్యాంకు, నగర సహకార బ్యాంకులు రూ.లక్ష వరకు విద్యా రుణం అందిస్తున్నాయి. ఈ రుణాన్ని గరిష్ఠంగా రూ.5 లక్షల వరకు పెంచారు. ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతుండగా, వారి సౌకర్యార్థం విద్యా రుణాన్ని రూ.5 లక్షల వరకు పెంచారు. ట్యూషన్ ఫీజు, హాస్టల్ ఫీజు, భోజనం తదితర ఫీజులు పరిగణలోకి తీసుకొని రుణం మంజూరు చేయవచ్చు. రుణాలపై వడ్డీని ఆయా బ్యాంకుల్లోని అసెట్ లయబిలిటీ కమిటీ నిర్ణయిస్తుంది. విద్య ముగించి ఆరు నెలల తర్వాత నుంచి ఐదేళ్లలో వడ్డీతో పాటు రుణాన్ని చెల్లించే వెసులుబాటు కల్పించారు.

రేషన్‌కార్డుదారులను ఇబ్బంది పెట్టొద్దు

పెరంబూర్, ఫిబ్రవరి 11: రేషన్ దుకాణాల్లో రేషన్ కార్డుదారుల వేలిముద్రలు నమోదు చేసి నిత్యావసర సరుకులు అందిస్తున్నారు. కొన్ని దుకాణాల్లో బయోమెట్రిక్ పరికరంలో వేలిముద్రల నమోదులో చిక్కులు తలెత్తడంతో దుకాణ సిబ్బంది సరుకులు ఇవ్వడం లేదని ఫిర్యాదులొస్తున్నాయి. ఈ నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ కార్యదర్శి హర్ సహాయ్ మీనా జిల్లా కలెక్టర్లకు పంపిన ఉత్తర్వుల్లో... వేలిముద్రలు నమోదు కాలేదని సరుకులు అందించకుండా ఉండడం, మరి కొన్ని వివరాలు కావాలని రేషన్‌కార్డుదారులను ఇబ్బంది పెట్టకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

ఆలయాల జీర్ణోద్ధరణకు అధిక నిధులు

● మంత్రి మనోతంగరాజ్

పెరంబూర్, ఫిబ్రవరి 11: డీఎంకే అధికారం చేపట్టిన తర్వాత ఆలయాల జీర్ణోద్ధరణ పనులకు అధికంగా నిధులు కేటాయిస్తున్నట్లు పాడిపరిశ్రమ శాఖ మంత్రి మనో తంగరాజ్ తెలిపారు. నాగర్‌కోయిల్‌లో ప్రసిద్ధిచెందిన నాగరాజ ఆలయ కుంభాభిషేకం 2006లో జరిగింది. ఈ ఆలయంలో జీర్ణోద్ధరణ పనులు చేపట్టి కుంభాభిషేకం నిర్వహించాలని సీఎం స్టాలిన్ ఉత్తర్వులు జారీచేశారు. దీంతో రూ.1.08 కోట్లతో చేపట్టిన ఆలయ జీర్ణోద్ధరణ పనులను ఆదివారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయాల్లో జీర్ణోదర్ధణ పనులు చేపట్టి కుంభాభిషేకం నిర్వహించేందుకు తమ ప్రభుత్వ ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కన్నియకుమారి జిల్లాల్లో మాత్రమే సుమారు 100 ఆలయాల్లో జీర్ణోద్ధరణ పనులు జరుగుతున్నాయని, మరో 100 ఆలయాల్లో ఈ పనులు చేపట్టాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు.

16న ప్రభుత్వ ఉద్యోగుల ఆందోళన

పెరంబూర్, ఫిబ్రవరి 11: పది డిమాండ్ల సాధనకు ఈనెల 16న 20 జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆందోళనలు చేపట్టనున్నట్టు సంఘ గౌరవాధ్యక్షుడు బాలసుబ్రమణియన్ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్రప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పాత పింఛన్ విధానం అమలు సహా 10 డిమాండ్ల సాధనకు ర్యాలీని నిర్వహించేందుకు అనుమతించాలని కోరగా చెన్నై నగర పోలీసు శాఖ అనుమతి ఇవ్వలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కడలూరు, విల్లుపురం, కళ్లకుర్చి, చెన్నై, మదురై, తిరుచ్చి సహా 20 జిల్లా ప్రధాన కేంద్రాల్లో ఆందోళనలు, సంఘ రాష్ట్ర నిర్వాహకుల ఆధ్వర్యంలో సచివాలయ ముట్టడి చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

19న సెకండరీ గ్రేడ్ టీచర్ల ఆందోళన

పెరంబూర్, ఫిబ్రవరి 11: పని గంటలకు సమాన వేతనం కోరుతూ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు ఈనెల 19న ఆందోళన చేపట్టనున్నట్టు సంఘ ప్రధాన కార్యదర్శి జె.రాబర్ట్ పేర్కొన్నారు. 2009 తర్వాత నియమితులైన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు పని గంటలకు సమాన వేతనం అందిస్తామని డీఎంకే ఎన్నికల హామీ అమలు కాలేదన్నారు. తమ డిమాండ్ల సాధనకు గత ఏడాది సెప్టెంబరు నుంచి వివిధ రూపాల్లో ఆందోళన చేపట్టినా ప్రభుత్వం స్పందించ లేదన్నారు. ఈక్రమంలో ఈనెల 19న నుంగంబాక్కంలోని పేరాసియర్ అన్బళగన్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్టు రాబర్ట్ తెలిపారు.

ఇతర రాష్ట్రాలకు డీఎంకే పథకాలు ఆదర్శం

● మంత్రి ఉదయనిధి


తిరుప్పూరులో తాగునీటి పథకాలను ప్రారంభిస్తున్న ఉదయనిధి

చెన్నై, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాల ఆదర్శంగా మారాయని, తమ రాష్ట్రాల్లోనూ అలాంటి పథకాలు అమలు చేస్తున్నారని యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధి అన్నారు. ఆదివారం ఉదయం తిరుప్పూరు కార్పొరేషన్‌లో రూ.1120.57 కోట్లతో కొత్త తాగునీటి పథకాలు, తిరుప్పూరు యూనియన్‌లో రూ.70.43 కోట్లతో 165 నివాస సముదాయాలకు తాగునీటి సరఫరా పథకం, రూ.53.48 కోట్లతో మల్టీపర్పస్ సామాజిక కేంద్రం, రూ.12.87 కోట్లతో వాహనాల పార్కింగ్ తదితర పథకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ గత మూడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం మహిళాభ్యుదయం కోసం ఎన్నో పథకాలు అమలు చేసిందని, ఆ పథకాలను తమ రాష్ట్రాల్లో అమలు చేయాలని పొరుగు రాష్ట్రాలు భావిస్తున్నాయని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రంలోని బీజేపీ పాలకులకు ఓటర్లు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

మద్రాసు వర్శిటీ తెలుగు శాఖలో 4న అంతర్జాతీయ సదస్సు

అడయార్, ఫిబ్రవరి 11: మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆధ్వర్యంలో మార్చి 4 నుంచి 6తేదీ వరకు అంతర్జాతీయ సదస్సు జరుగనుంది. 'కవిత్రయం మహాభారతం - వర్తమాన సమాజం: సమాలోచన' అనే అంశంపై ఈ సదస్సును మద్రాస్ యూనవర్శిటీ మెరీనా క్యాంపస్‌లోని రజతోత్సవ ప్రాంగణంలో నిర్వహిస్తామని తెలుగు శాఖాధిపతి, సదస్సు సంచాలకుడు ఆచార్య విస్తాలి శంకర్‌రావు పేర్కొన్నారు. ఇందులో పత్ర సమర్పణకు పరిశోధన పత్రాలను ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన పరిశోధకులు తమ విలువైన పరిశోధన వ్యాసాలను సమర్పించవచ్చని పేర్కొన్నారు. ఇందులో సమర్పించే పరిశోధన వ్యాసాలను యూజీసీ కేర్ జర్నల్ 'మూసి' పత్రికలో ప్రచురించి సదస్సు సమాపనోత్సవ సమావేశంలో ఆవిష్కరిస్తామని తెలిపారు. అయితే, కవిత్రయం మహాభారతాన్ని ఆధునిక మానవుడి జీవనానికి అన్వయించి, దాని అవసరాన్ని, ఆవశ్యకతను తెలిపే విధంగా వ్యాసాలు ఉండాలని, ఒకే పర్వానికి సంబంధించిన ఎక్కువ వ్యాసాలు ఎంపిక చేయరని తెలిపారు. అక్షర దోషాలున్నా, నాలుగు పుటలకు తక్కువగా ఉన్నా, పునరావృత్తమైన వ్యాసాలను అంగీకరించమన్నారు. పరిశోధన వ్యాసం ఎంపిక అయిన తర్వాతనే తగిన రుసుం చెల్లించాల్సి ఉంటుందని, వ్యాస ప్రచురణ నిమిత్తం రూ.600ను 97018 69674 అనే నెంబరుకు జీపే లేదా ఫోన్‌పేలో చెల్లించాల్సి ఉంటుందన్నారు. భారత దేశం వెలుపల ఉండే వారు కూడా సదస్సులో పాల్గొనవచ్చని తెలిపారు. రచనలను ఈనెల 20వ తేదీలోపు "ఝుఙ్జీఛచ్చిట్బఙ్జిరుఝ032024ః ఙుఝుజీజూ.ఛిౌఝు"కు పంపించాల్సి ఉంటుందన్నారు. సదస్సులో పాల్గొన్న వారికి మాత్రమే ప్రశంసాపత్రం అందిస్తామని, ఆర్థిక వనరుల దృష్ట్యా పత్ర సమర్పకులు తమ సదుపాయాలను స్వయంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇక ఈ సదస్సు కోసం ప్రత్యేక వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేసి సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజేస్తామన్నారు. వివరాల కోసం సహ సంచాలకుడు డాక్టర్ పాండురంగం కాళియప్ప (97018 69674), డాక్టర్ మాదా శంకర్‌బాబు (72006 85477) ను సంప్రదించవచ్చన్నారు.

నీరందక మేతగా మారిన వరి


పంటను మేస్తున్న మేకలు

చెన్నై, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ధాన్యాగారంగా పేరుగడించిన తంజావూరు జిల్లాలో కావేరి జలాలందక కోతకు సిద్ధంగా ఉన్న వరి ఎండిపోతోంది. తమ కళ్లెదుటే మాడుతున్న పంటను చూసి రైతులు కంటతడిపెట్టుకుంటున్నారు. తంజావూరు జిల్లా కీళ్‌తిరుపూదుర్తి, మేల్‌తిరుపూదుర్తి, కాట్టుకోట్టై, పాద్దై తదితర ప్రాంతాల్లో కావేరి వాగు జలాల ద్వారా వరి పండిస్తున్నారు. ఇటీవల ఆ వాగు అడుగంటి పోవడంతో ఆయకట్టు కింద పండించిన వాడుమొఖం పట్టింది. దీంతో నీరందే మార్గం లేకపోవడంతో జీవాలకు మేతగా వదిలేశారు. పంటలకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

అయోధ్యకు వెళ్లనున్న లక్షమంది

పెరంబూర్, ఫిబ్రవరి 11: రాష్ట్రం నుంచి ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అయోధ్య శ్రీరామాలయం దర్శనానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం కేంద్రప్రభుత్వం 35 ప్రత్యేక రైళ్లు నడుపుతోంది. ఈ రైళ్లు కోయంబత్తూర్, మదురై, కన్నియాకుమారి తదితర నగరాల నుంచి అయోధ్యకు వెళ్లనున్నాయి. ఈ రైళ్లలో ప్రయాణించేందుకు లక్షమంది నమోదు చేసుకున్నారు. వారి ప్రయాణ ఛార్జీ, ఆహారం, బస తదితరాలను కేంద్రప్రభుత్వమే భరిస్తుందని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు దర్శనం చేసేలా అన్ని చర్యలు చేపట్టినట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ప్రకటన విడుదల చేశారు.

రూ.కోటి విలువైన బీడీ ఆకుల స్వాధీనం

అడయార్, ఫిబ్రవరి 11: తూత్తుక్కుడి సిలువైపట్టి సముద్రతీరం మీదుగా శ్రీలంకకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన కోటి రూపాయల విలువైన బీడీ ఆకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆకులను తరలించేందుకు సిద్ధంగా ఉంచిన రెండు పడవలతో పాటు ఒక ద్విచక్రవాహన్ని సీజ్ చేశారు. తూత్తుకుడి సముద్ర తీరం మీదుగా బీడీ ఆకులను శ్రీలంకకు తరలిస్తున్నారంటూ వచ్చిన సమాచారంతో స్థానిక పోలీసులు సముద్ర తీర గస్తీ దళంతో కలిసి మఫ్టీలో నిఘా వేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం వేకువజామున తాలముత్తునగర్ సమీపంలోని సిలువైపట్టి నుంచి ఈ బీడీ ఆకులను తరలించేందుకు సిద్ధంగా ఉంచిన రెండు పడవను గుర్తించారు. ఈ పడవల్లో 84 బస్తాల్లో మూడు టన్నుల బీడీ ఆకులను స్వాధీనం చేసుకున్నారు. స్మగ్లర్ల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

అమ్మాయిల వలలో చిక్కి మోసపోతున్న యువత

అడయార్, ఫిబ్రవరి 11: ఆన్‌లైన్ వీడియో కాల్‌లో అందమైన అమ్మాయిలతో మాట్లాడించి, అనేక మంది యువకుల వద్ద డబ్బు స్వాహా చేస్తున్న ముఠా కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇలా మోసపోయిన వారిలో తిరునెల్వేలి, తెన్‌కాశి, తూత్తుక్కుడి జిల్లాలకు చెందిన యువత అధిక సంఖ్యలో ఉన్నారు. ఇటీవల సైబర్ మోసాలు పెరిగిన విషయం తెల్సిందే. ఇలాంటి వాటిలో యువతను తమ వలలో వేసుకునేందుకు అందమైన అమ్మాయిలతో వీడియో కాల్‌లో మాట్లాడించి, వారి నుంచి సైబర్ నేరగాళ్ళు డబ్బు గుంజుతున్నారు. ఇలాంటి బాధితులు పలువురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన సైబర్ క్రైమ్ పోలీసులు... ఈ ఆన్‌లైన్ మోసగాళ్ళ కోసం గాలిస్తున్నారు.

ఆవడిలో పడవ మెకానిక్ దారుణహత్య

అడయార్, ఫిబ్రవరి 11: స్థానిక ఆవడిలో పడవ మెకానిక్ దారుణహత్యకు గురయ్యాడు. తన భర్తపై జరుగుతున్న దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన భార్య, కుమార్తె, అత్తపై కూడా దుండగులు విచక్షణా రహితంగా దాడి చేశారు. శనివారం రాత్రి హత్య జరిగింది. ఆవడి సమీపంలోని అన్ననూర్‌కు చెందిన మాధవన్ (65) పడవ మెకానిక్. ఈయనకు భార్య సియమాలా, ఇద్దరు కుమార్తెలున్నారు. పెద్ద కుమార్తె రష్యాలో విద్యాభ్యాసం చేస్తోంది. చిన్న కుమార్తె స్థానిక పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. వీరితో పాటు అత్త విజిమేరీ కూడా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి కొందరు దుండగులు ఇంట్లోకి మారణాయుధాలతో ప్రవేశించి మాధవన్‌పై దాడి చేశారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన కుటుంబ సభ్యులపై కూడా దాడి చేశారు. దాడిలో తీవ్రంగా గాయపడిన మాధవన్... ఇంట్లోనే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న తిరుముల్లైవాయిల్ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. గాయపడిన సియమాలా, కుమార్తె దీక్షిత, విజిమేరీని సమీపంలోని ఆస్పత్రికి తరించి పరారీలో ఉన్న దుండగుల కోసం గాలిస్తున్నారు.

కోవై కారు బాంబు పేలుడు కేసులో మరో నలుగురి అరెస్ట్


నలుగురు యువకులను నిర్బంధించి తీసుకెళుతున్న పోలీసులు

పెరంబూర్, ఫిబ్రవరి 11: కోయంబత్తూర్ కారు బాంబు పేలుడు ఘటనకు సంబంధించి మరో నలుగురిని ఎన్ఐఏ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఎన్ఐఏ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో... కోవై కారు బాంబు కేసులో ఇప్పటికే 13 మందిని అరెస్ట్ చేయగా, వారు అందించిన సమాచారం, లభించిన సాక్ష్యాధారాల ఆధారంగా శనివారం 8 జిల్లాల్లో 21 ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టామని తెలిపింది. ఈ తనిఖీల్లో నలుగురిని అరెస్ట్ చేయడంతో పాటు 6 ల్యాప్‌టాప్‌లు, 25 సెల్‌ఫోన్లు, 34 సిమ్‌కార్డులు, 3 హార్డ్ డిస్కులు స్వాధీనం చేసుకున్నట్లు ఎన్ఐఏ తెలిపింది.

ఎక్కడినుంచైనా పోటీకీ రెడీ!

● కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం


పెరంబూర్, ఫిబ్రవరి 11: పార్టీ అధిష్ఠానం ఎక్కడ నుంచి పోటీ చేయమంటే అక్కడ నిలబడుతానని శివగంగ కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం తెలిపారు. పుదుకోటలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... గతంలో తాను పోటీ చేసిన శివగంగలో డీఎంకే సహా తమ పార్టీలోనే పలువురు పోటీకి ఆసక్తి చూపుతున్నారనే వార్తలు వస్తున్నాయని, ఎన్నికల్లో సమయంలో ఇది సహజమేనన్నారు. ప్రధాని మోదీ గురించి తాను తెలిపిన అభిప్రాయాలను వెనక్కి తీసుకొనే ప్రసక్తే లేదన్నారు. తాము వెలిబుచ్చిన అభిప్రాయాలన్నీ వాస్తవాలన్నారు. హిందీ మాట్లాడే రాష్ట్రాల్లో మోదీ ప్రభావం అధికంగ ఉండగా, హిందీ మాట్లాడని రాష్ట్రాల్లో తక్కువగా ఉందన్నారు. రాష్ట్రం వరకు డీఎంకే - కాంగ్రెస్ కూటమి బలంగా ఉందని, రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో 39 స్థానాలను ఈ కూటమి చేజిక్కించుకుంటుందని ఎంపీ కార్తీ తెలిపారు.

నేడు డీఎండీకే ఫ్లాగ్ డే వేడుకలు

ప్యారీస్, ఫిబ్రవరి 11: రాష్ట్రవ్యాప్తంగా సోమవారం డీఎండీకే ఫ్లాగ్ డే వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత పేర్కొన్నారు. ఫిబ్రవరి 12వ తేది డీఎండీకే 24వ వార్షిక ఫ్లాగ్ డేను యేటా పండుగలా జరుపుకొని పేదలకు సంక్షేమ సహాయాలు పంపిణీ చేస్తుంటారు. ఈ సందర్భంగా వాడవాడలా డీఎండీకే జెండాను ఎగురవేసి పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రేమలత పిలుపునిచ్చారు.

రెండో భార్యకు చిత్రహింస రెండో భర్త అరెస్టు

అడయార్, ఫిబ్రవరి 11: సేలం జిల్లాలో రెండో భార్యను, ఆమె ఇద్దరు పిల్లలను చిత్రహింసలకు గురిచేసి, హత్య చేస్తానని బెదిరించిన ప్రవాస భారతీయుడు, రెండో భర్త భాస్కర్‌ను సేలం టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సేలం నగరం తిరువాక్కవూరుకు చెందిన ఆర్తీకి వివాహమై ఇద్దరు పిల్లలున్నారు. ఈమె మొదటి భర్త 2021లో కరోనాతో మరణించాడు. భర్త మరణం నుంచి తేరుకున్న ఆర్తీ తల్లిదండ్రుల వద్దే ఉంటూ ఉద్యోగం చేస్తూ తన పిల్లలను పోషించుకుంటోంది. ఈ క్రమంలో అమెరికాకు చెందిన భాస్కర్ అనే ఇంజనీర్‌ను రెండో వివాహం చేసుకుంది. ఈయనకు కూడా ఇది రెండో పెళ్ళి. వీరి దాంపత్య జీవితం కొంతకాలం సాఫీగా సాగింది. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తాయి. దీంతో ఆర్తీతో పాటు ఆమె పిల్లలను వేధించడం, చిత్రహింసలకు గురిచేయడం ప్రారంభించారు. ఈ క్రమంలో ఆర్తీ ఫిర్యాదు మేర కు భాస్కర్‌పై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు అరెస్టు చేశారు.



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై చేపట్టిన ఎన్ మన్... ఎన్ మక్కల్ పాదయాత్ర చెన్నైకు చేరుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు విచ్చేసిన ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు స్వాగతం పలికి శాలువతో సత్కరిస్తున్న బీజేపీ రాష్ట్ర వ్యవహారాల కో-ఇన్‌ఛార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి - జేపీ నడ్డాను శాలువతో సత్కరిస్తున్న కేంద్ర మాజీ మంత్రి పొన్ రాధాకృష్ణన్

40 స్థానాల్లో డీఎంకే కూటమిదే విజయం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణన్

ప్యారీస్, ఫిబ్రవరి 11: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలోని 40 స్థానాల్లో డీఎంకే కూటమి విజయం సాధిస్తుందని, ఈ ఎన్నికల్లో బీజేపీకి చిరుమానా గల్లంతవుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్ అన్నారు. హార్బర్ నియోజకవర్గం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు సింగారవేలన్ 78వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి బాలకృష్ణన్ తదితరులు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో మతశక్తులు విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నాయని, మతవాదాన్ని రెచ్చగొట్టే వారు అధికారంలో కూర్చొని ప్రజల మధ్య చిచ్చు రేపుతున్నారన్నారు. ఇలాంటి వారు మళ్లీ అధికారంలోకి వస్తే దేశానికే ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేశారు. పాత ఇనుప సామానులు విక్రయించే వ్యాపారిగా బీజేపీ అధ్యక్షుడు అన్నామలై ఊర్లు తిరుగుతున్నారని, ఆయన చేపట్టిన పాదయాత్రకు ప్రజల్లో గుర్తింపు లేదన్నారు. ప్రాంతీయ పార్టీల బలమైన ఓటు బ్యాంక్ కలిగిన 'ఇండియా' కూటమి రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ప్రజల మద్దతుతో విజయం సాధిస్తుందని బాలకృష్ణన్ తెలిపారు.


సింగారవేలన్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న సీపీఎం నేతలు

ఎవరితో కూటమి?

● ఓటింగ్ ద్వారా టీఎంఎంకే అభిప్రాయ సేకరణ


ఓటింగ్‌లో నేతలు

పెరంబూర్, ఫిబ్రవరి 11: తమిళగ మక్కల్ మున్నేట్ర కళగం కార్యనిర్వహణ కమిటీ సమావేశం ఆ పార్టీ అధ్యక్షుడు జాన్‌పాండ్యన్ నేతృత్వంలో శనివారం చెన్నైలో జరిగింది. మహిళా విభాగం అధ్యక్షురాలు వినోలిన్ నివేద పాండ్యన్ అధ్యక్షత జరిగిన సమావేశంలో 100 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశంలో రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ఏ పార్టీతో పొత్తు పెట్టుకోవాలన్న విషయం సమావేశంలో పాల్గొన్న ప్రతినిధుల అభిప్రాయాలతో కూడిన ఓటింగ్ జరిగింది. ఈ సందర్భంగా జాన్ పాండ్యన్ మాట్లాడుతూ.. ప్రతినిధులు అభిప్రాయం తెలుసుకొనేందుకు ఐదుగురితో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం ఐదు స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయించామని, చర్చల అనంతరం సీట్ల సర్దుబాటు ఉంటుందని ఆయన తెలిపారు.

మూడేళ్లలో 548 రైతు సమస్యల పరిష్కారం

● మంత్రి ఎమ్మార్కే పన్నీర్‌సెల్వం

పెరంబూర్, ఫిబ్రవరి 11: రాష్ట్రంలో గత మూడేళ్లలో రైతులు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన 548 సమస్యలు పరిష్కరించినట్లు వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి ఎమ్మార్కే పన్నీర్‌సెల్వం తెలిపారు. 2024-25వ సంవత్సరం వ్యవసాయ బడ్జెట్ తయారీకి సంబంధించి రైతుల అభిప్రాయ సేకరణ శనివారం మంత్రి ఎమ్మార్కే పన్నీర్ సెల్వం అధ్యక్షతన జరిగింది. రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన సుమారు 500 మందికి పైగా రైతులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ... వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ తరుపున ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో చేరాల్సిన అంశాలపై రైతుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నామన్నారు. మూడేళ్లలో 19 అభిప్రాయ సేకరణ సమావేశాలు నిర్వహించగా, రైతులు తెలియజేసిన 548 సమస్యలు పరిష్కరించినట్లు మంత్రి తెలిపారు.

నేడు టీఎంసీ రాష్ట్రస్థాయి సమావేశం

పెరంబూర్, ఫిబ్రవరి 11: రానున్న పార్లమెంటు ఎన్నికలపై చర్చించేందుకు సోమవారం రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు తమిళ మానిల కాంగ్రెస్ (టీఎంసీ) అధ్యక్షుడు జీకే వాసన్ ప్రకటించారు. స్థానిక ఎగ్మూర్‌లోని అశోకా హోటల్‌లో ఉదయం 10 గంటలకు జరగనున్న సమావేశంలో రాష్ట్ర నిర్వాహకులు, జిల్లా అధ్యక్షులు, కార్య నిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొని, పార్లమెంటు ఎన్నికల్లో కూటమి ఏర్పాటు, ప్రచారం తదితరాలపై చర్చించనున్నట్లు ఆ పార్టీ అధ్యక్షుడు జీకే వాసన్ తెలిపారు.

పోలీసు భద్రత మధ్య కందదేవి ఆలయ రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు, భద్రతలో పోలీసులు

పెరంబూర్, ఫిబ్రవరి 11: శివగంగ జిల్లా దేవకోట సమీపంలోని కందదేవి స్వర్ణమూర్తీశ్వరర్ ఆలయ రథోత్సవం సుమారు 1,100 మంది పోలీసుల పహారాతో సాగింది. 17 ఏళ్లుగా ఇరువర్గాల మధ్య తలెత్తిన ఘర్షణ కారణంగా కందదేవి ఆలయ రథోత్సవం నిర్వహించడం లేదు. ఈ నేపథ్యంలో, హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ ఉత్తర్వులతో ఆదివారం ఉదయం భారీ పోలీసు బందోబస్తు మధ్య కందదేవి ఆలయ రథోత్సవం జరిగింది.

పాఠశాలలు - పెట్రోల్ బంక్ మధ్య 30 మీటర్ల దూరం తప్పనిసరి

పెరంబూర్, ఫిబ్రవరి 11: పాఠశాలలు, వైద్యశాలలకు కనీసం 30 మీటర్ల దూరంలో పెట్రోల్ బంకులు ఏర్పాటు చేయాలని దక్షిణ మండల గ్రీన్ ట్రిబ్యునల్ ఉత్తర్వులు జారీ చేసింది. కడలూరు జిల్లా కరై ఓరవిట్టు కుప్పంలో పాఠశాలలు, వైద్యశాలలు, జనావాస ప్రాంతాల్లో ఉన్న పెట్రోల్ బంకును తొలగించేలా ఉత్తర్వులు జారీ చేయాలని జిల్లా వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో దాఖలైన పిటిషన్ విచారించిన న్యాయమూర్తి పుష్పా సత్యనారాయణ, నిపుణుల కమిటీ సభ్యుడు సత్యగోపాల్ జారీ చేసిన ఉత్తర్వుల్లో... జాతీయ కాలుష్య నియంత్రణ బోర్డు నిబంధనల ప్రకారం, కడలూరు జిల్లా కరై ఓరవిట్టు కుప్పంలో ఉన్న పెట్రోల్ బంక్‌కు పాఠశాలలు, వైద్యశాలలకు మధ్య 30 మీటర్ల దూరం ఉందని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అఫిడవిట్ దాఖలు చేసిందన్నారు. జాతీయ కాలుష్య నియంత్రణ బోర్డు నిబంధనల మేరకు, పాఠశాలలు, వైద్యశాలలకు 50 మీటర్ల దూరంలో పెట్రోల్ బంక్‌లు ఉండాలన్నారు. కానీ, వేరే మార్గం లేని పరిస్థితుల్లో తక్కువగా, 30 మీటర్ల దూరం ఉంటే చాలన్నారు. ఈ పెట్రోల్ బంక్ ఏ కారణాలతో 30 మీటర్లలోపు ఏర్పాటు చేశారో తెలియడం లేదన్నారు. తగిన భద్రత చర్యలు బంక్‌లో చేపట్టాల్సిన ఉందన్నారు. ఈ కేంద్రం అద్దె భవనంలో ఉండడంతో ఇతర ప్రాంతానికి తరలించడం ఇబ్బంది ఉందని భావిస్తున్నామన్నారు. ఈ విషయమై పెట్రోల్ బంక్ యజమాని, ఐఓసీ అఫిడవిట్లు సమర్పించాలని పేర్కొన్న జడ్జి తదుపరి విచారణ మార్చి 5వ తేదీకి వాయిదా వేశారు.

జలాశయాల పూడికతీతకు రూ.115 కోట్లు

పెరంబూర్, ఫిబ్రవరి 11: పార్లమెంటు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యేలోపు, రాష్ట్రంలోని జలాశయాల్లో పూడికతీత పనులు చేపట్టేందుకు రూ.115 కోట్లను రాష్ట్రప్రభుత్వం కేటాయించింది. ఈశాన్య రుతుపవనాల వర్షాలతో చెన్నై, తిరువళ్లూర్, కాంచీపురం, చెంగల్పట్టు, కడలూరు జిల్లాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రుతుపవనాల సీజన్ ప్రారంభానికి ముందే చెన్నై మండల నీటిపారుదల శాఖ పరిధిలోని ఈ జిల్లాల్లో ఉన్న జలాశయాల్లో పూడికతీత పనులు చేపట్టేందుకు యేటా రూ.20 కోట్లు కేటాయిస్తుంటారు. ఈ నేపథ్యంలో, కోవై, మదురై తదితర మండలాల్లో కూడా పూడికతీత పనులు చేపట్టాలని ఆ శాఖ అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఈ ఏడాది డెల్టా జిల్లాలకు రూ.95 కోట్లు, చెన్నై మండలంలోని కడలూరు జిల్లాకు రూ.15 కోట్లు, మదురై మండలానికి రూ.4 కోట్లు, కోవై మండలానికి రూ.కోటి కేటాయించారు. 1,004 విభాగాలుగా పనులను విభజించి కాంట్రాక్టర్లను ఎంపిక చేయనున్నట్టు అధికారులు తెలిపారు.

మందలించిన తండ్రి: టెన్త్ విద్యార్థిని ఆత్మహత్య

అడయార్, ఫిబ్రవరి 11: తండ్రి మందలించడంతో టెన్త్ విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. పులియంతోపు కేబీ గార్డెన్ 7వ వీధికి చెందిన సతీష్, సుకన్య దంపతులకు అభినయ, అజయ్ పిల్లలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తడంతో తన కుమారుడితో కలిసి సుకన్య పుట్టింట్లో ఉంటోంది. అభినయ మాత్రం తండ్రి వద్దే ఉంటూ స్థానికంగా ఉండే పాఠశాలలో టెన్త్ చదువుకుంటుంది. అయితే, కుమార్తెను తండ్రి మందలించాడు. దీంతో శుక్రవారం పాఠశాల నుంచి తిరిగి వచ్చిన తర్వాత పడక గదికి వెళ్ళిన అభినయ... తలుపులు వేసుకుంది. ఎంతకీ బయటకు రాకపోవడంతో తండ్రి వెళ్ళి చూడగా, ఫ్యానుకు ఉరేసుకుని కనిపించింది. ఆ వెంటనే బాలికను రాయపురంలోని స్టాన్లీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, విద్యార్థిని మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

'సబర్బన్' ప్రయాణికుల అవస్థలు

పెరంబూర్, ఫిబ్రవరి 11: స్థానిక కోడంబాక్కం - తాంబరం మధ్య రైలు మార్గంలో చేపట్టిన మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు చెన్నై బీచ్ - తాంబరం - చెంగల్పట్టు రైళ్లు రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, ఎంటీసీ సంస్థ అదనపు బస్సులు నడపకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. అందులోనూ ఆదివారం కావడంతో ఎంటీసీ బస్సులు తక్కువ సంఖ్యలోనే నడపడంతో ఉన్న సర్వీసుల్లో ప్రయాణికులు క్రిక్కిరిసి ప్రయాణించారు. తాంబరం సహా పలు బస్టాండ్లలో ప్రయాణికులు చాలాసేపు వేచి ఉండాల్సిన పరిస్థితి కనిపించింది.

శ్రీకాంత్ - ప్రియాంక జంటగా రొమాంటిక్ థ్రిల్లర్

శ్రీకాంత్ - ప్రియాంక దిమ్మేష్ జంటగా రొమాంటిక్ సస్పెన్స్ క్రైం థ్రిల్లర్ తెరకెక్కింది. ఈ సినిమాకు 'సత్తం ఇని ముత్తం తా' టైటిల్‌ను ఖరారు చేయగా, పలువురు సీనియర్ దర్శకుల వద్ద సహాయకుడిగా పనిచేసిన రాజ్‌దేవ్ దర్శకత్వం వహించారు. ఇప్పటికే చిత్రీకరణతోపాటు సెన్సార్‌ను పూర్తి చేసుకున్న ఈ చిత్రం మార్చి 1న విడుదలకు సిద్ధమైంది. ఈ చిత్రం గురించి దర్శకుడు రాజ్‌దేవ్ వివరిస్తూ... 'ప్రేమ, సస్పెన్స్‌తో కూడిన రొమాంటిక్ థ్రిల్లర్. ఇది ఊహించిన మలుపులతో ప్రేక్షకులను ఉత్కంఠతకు లోను చేస్తుంది. హీరో శ్రీకాంత్ ఇప్పటి వరకు ఈ తరహా పాత్రను పోషించలేదు. హీరోహీరోయిన్ల మధ్య సన్నివేశాలు ప్రేక్షకులను అలరిస్తాయి. హరీష్ పేరడి ఇందులో ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా నటించారు. మొత్తం మూడు పాటలుండగా, సరిగమ ఆడియో ద్వారా రిలీజ్ చేయగా మంచి స్పందన వచ్చింది. ఈ తరహా టైటిల్ పెట్టడానికి కారణం లేకపోలేదు. బాల్యం నుంచి ప్రేమికులుగా ఉండే హీరోహీరోయిన్లు... టీనేజ్‌లో పరిస్థితుల ప్రభావం కారణంగా విడిపోతారు. ఆ తర్వాత హీరో ఓ పెళ్లి చేసుకుంటాడు. హీరోయిన్ ఓ ప్రమాదంలో చిక్కుకుని అపస్మారక స్థితిలోకి చేరుకుంటుంది. అలాంటి పరిస్థితుల్లో తన ప్రియురాలైన హీరోయిన్‌ను చూసిన హీరో... ఏం చేశారు? తన ప్రియుడికి హీరోయిన్ ముద్దు పెట్టిందా? ప్రియురాలి ప్రాణాలను హీరో రక్షించారా? అన్నదే ఈ చిత్ర కథ. ఆసక్తికరమైన, ఉత్కంఠకు లోనుచేసే స్ర్కీన్‌ప్లేతో తెరకెక్కించాం' అని తెలిపారు. సెలబ్రేట్ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మాత ఎస్.కార్తికేయన్ నిర్మించారు. ఎం.యువరాజ్ కెమెరామెన్‌గా పనిచేయగా, జుబిన్ సంగీతం అందించారు.


శ్రీకాంత్ - ప్రియాంక దిమ్మేష్

'ద్రౌపది'గా జాన్వీ కపూర్?



దివంగత నటి శ్రీదేవి కుమార్తె, బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ కోలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నారు. ఆమె ద్రౌపది పాత్రను పోషించనున్నారు. సూర్య హీరోగా నటించనున్న చిత్రంలో ఆమె నటించనున్నారు. ప్రస్తుతం హీరో సూర్య చిరుత్తై శివ దర్శకత్వంలో 'కంగువా' చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రం తర్వాత 'సూర్రైపోట్రు' ఫేం సుధా కొంగర దర్శకత్వంలో హీరో సూర్య నటించనున్నారు. ఈ రెండు చిత్రాల నిర్మాణం పూర్తయిన తర్వాత మహాభారతంలోని 'కర్ణుడు' పాత్రతో ఒక చిత్రాన్ని నిర్మించనున్నారు. రమేష్ ఓంప్రకాష్ మెహ్రా ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. ఇందులో ద్రౌపది పాత్రకు జాన్వీ కపూర్‌ను ఎంపిక చేసినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. ఈ విషయాన్ని త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు. కాగా, ప్రస్తుతం జాన్వీకపూర్ తెలుగులో కూడా హీరో జూనియర్ ఎన్టీఆర్ సరసన 'దేవర' చిత్రంలో నటిస్తున్న విషయం తెల్సిందే.

చిత్రజ్యోతి

కాళిదాస్ జయరాం హీరోగా
'నిలా వరుమ్ నేరమ్'

కాళిదాస్ జయరాం హీరోగా 'నిలా వరుం నేరం' అనే పేరుతో ఓ చిత్రం తెరకెక్కనుంది. మిరాకిల్ మూవీస్ బ్యానరుపై శృతి నల్లప్ప నిర్మిస్తున్నారు. తమిళం, తెలుగు భాషల్లో నిర్మితంకానుంది. ఈ సినిమా పూజా కార్యక్రమం పాలక్కాడ్‌లో జరిగింది. ఈ పీరియాడిక్ సూపర్ నేచురల్ థ్రిల్లర్ తమిళ వెర్షన్‌లో కాళిదాస్ జయరాం కథానాయకుడిగా నటిస్తున్నారు. గతంలో 'ఎన్న సొల్ల పోగిరాయ్' అనే ఫీల్ గుడ్ మూవీని తెరకెక్కించిన హరి... ఈ చిత్రానికి దర్శకుడు. ఈ ప్రాజెక్టు గురించి నిర్మాత శృతి నల్లప్ప మాట్లాడుతూ... 'మిరాకిల్ మూవీస్ ఎల్లవేళలా ప్రేక్షకులను అలరించే, ఆకట్టుకునే కథలను ఎంపిక చేసి, వాటిని గొప్పగా చిత్రీకరించి అందిస్తుంది. హీరో కాళిదాస్ జయరాం టైంతో సంబంధం లేకుండా అంకితభావంతో తన ప్రతిభకు సానబట్టే పాత్రలను ఎంచుకుంటూ ముందుకు సాగుతున్నారు. అలాంటి నటుడు మా బ్యానరులో నటించడం చాలా సంతోషంగా ఉంది. ఈ సినిమా కచ్చితంగా కాళిదాస్ కెరీర్‌లో మంచి చిత్రంగా నిలుస్తుంది. దర్శకుడు హరి వృత్తిపట్ల ఉండే దార్శనికత, నైపుణ్యం నిస్సందేహంగా ఈ సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దుతారు' అని ఆమె పేర్కొన్నారు.


'నిలా వరుమ్ నేరమ్' పూజా కార్యక్రమం

18న సినీ మ్యుజీషియన్స్ యూనియన్ ఎన్నికలు

● మూడోసారి పోటీ చేస్తున్నా: ధీనా


సంగీత దర్శకుడు ధీనా తదితరులు

సినీ మ్యుజీషియన్స్ యూనియన్‌కు ఈనెల 18వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల నిర్వహణపై ఇంతకాలం ఉన్న స్టేను కోర్టు ఎత్తివేసింది. దీంతో ఎన్నికలు నిర్వహించనున్నట్టు ప్రస్తుత అధ్యక్షుడు ధీనా తెలిపారు. ఈ ఎన్నికల్లో అధ్యక్ష పదవికి మూడోసారి పోటీ చేస్తున్నట్టు ఆయన చెప్పారు. నిజానికి గత యేడాది సెప్టెంబరు 24న ఎన్నికలు జరగాల్సి ఉంది. కానీ, ఇప్పటివరకు ఓటు హక్కులేని అసోసియేట్ సభ్యులకు కూడా ఓటు హక్కు కల్పించారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కొందరు న్యాయ పోరాటానికి దిగారు. దీంతో ఈ ఎన్నికల నిర్వహణపై హైకోర్టు స్టే విధించింది. ఈ పిటిషన్‌పై తాజాగా విచారణ జరిపిన కోర్టు.. స్టేను తొలగించడంతో పాటు ఎన్నికలు నిర్వహించుకునేందుకు అనుమతి ఇచ్చింది. దీంతో ఎన్నికల నిర్వహణకు ప్రస్తుత కమిటీ ఏర్పాట్లు చేపట్టింది. ఈ సందర్భంగా ధీనా మాట్లాడుతూ... ఎన్నికల్లో అసోసియేట్ సభ్యులు కూడా ఓటు హక్కు కల్పించా. నేను మూడోసారి పోటీ చేస్తున్నా. మళ్లీ గెలిస్తే యూనియన్ భవన నిర్మాణాన్ని పునర్నిర్మాణాని కృషి చేస్తా' అని హామీ ఇచ్చారు.

కేంద్రంలో ప్రజా సంక్షేమ ప్రభుత్వమే అధికారంలోకి రావాలి

● డీఎంకే ఎంపీ కనిమొళి


సేలం సభలో ప్రసంగిస్తున్న డీఎంకే ఎంపీ కనిమొళి

చెన్నై, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల తర్వాత కేంద్రంలో దేశ ప్రజల బాగోగులు పట్టించుకునే, రాష్ట్రాల సంక్షేమం కోరుకునే ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నదే తమ పార్టీ ఆశయమని డీఎంకే డిప్యూటీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ కనిమొళి అన్నారు. ఆదివారం ఉదయం సేలం ఐదురోడ్ల కూడలిలోని స్టార్‌హోటల్‌లో సేలం, నామక్కల్, కళ్లకురిచ్చి జిల్లాలకు చెందిన ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ సమావేశం జరిగింది. ఆ సమావేశంలో ఆమె ప్రసంగిస్తూ... పార్టీ అధ్యక్షుడు స్టాలిన్ ఆదేశాల మేరకే ఎన్నికల మేనిఫెస్టో అంశాలపై ప్రజాభిప్రాయ సేకరణ జరుపుతున్నారని చెప్పారు. ఈ సారి అన్ని వర్గాలను ఆకట్టుకునే రీతిలో మేనిఫెస్టో ఉంటుందన్నారు. కేంద్రంలో రెండుసార్లు వరుసగా అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని, కార్పొరేట్ సంస్థల కొమ్ముకాస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్రాలకు చాలినన్ని నిధులివ్వకుండా కేంద్రం ఇబ్బంది పెడుతోందని, ఇటీవల వరదల నష్టపోయిన ఎనిమిది జిల్లాలకు వరద సాయాన్ని విడుదల చేయకుండా మొండి వైఖరి ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్ర ప్రయోజనాలను కాపాడే ప్రభుత్వమే కేంద్రంలో అధికారంలో రావాలన్నదే డీఎంకే కూటమి ఆకాంక్ష అని, ఆ దిశగా పార్టీ శ్రేణులు తీవ్రంగా పాటుపడ్డాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డీఎంకే రైతు విభాగం కార్యదర్శి ఏకేఎస్ విజయన్, వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు కోవి చెళియన్, ఎంపీ కేఆర్ఎన్ రాజేష్‌కుమార్, విద్యార్థి విభాగం కార్యదర్శి ఎళిల్ అరసన్, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

వాసవి మాత ఆత్మార్పణ దినం

● ఎస్కేపీడీలో ప్రత్యేక పూజలు


విశేష పూజల్లో పాల్గొన్న ఎస్కేపీడీ నిర్వాహకులు

ప్యారీస్, ఫిబ్రవరి 11: స్థానిక జార్జిటౌన్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్కేపీడీ)లో ఆదివారం వాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అమ్మవారికి మహా అభిషేకం, యాగం, క్షీరాభిషేకం, ఎర్రగులాబీలతో విశేష అలంకరణ, హారతి తదితరాలను ఆలయ అర్చక బృందం శాస్త్రోక్తంగా నిర్వహించింది. ఎస్కేపీడీ ధర్మకర్త కొల్లా వెంకట చంద్రశేఖర్, పాలక మండలి సభ్యులు ఊటూకూరు శరత్‌కుమార్, దేసు లక్ష్మీనారాయణ, ఎస్.ఎల్.సుదర్శనం, టీవీ రామకుమార్, సీఆర్ సురేష్‌బాబు, తాతా బద్రీనాథ్, సెక్రటరీ ఎం.కిషోర్‌కుమార్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. మాజీ ట్రస్టీ ఊరా ఆంజనేయులు అమ్మవారి ఆత్మార్పణను వివరించారు. ఈ పూజల్లో 102 గోత్రాలకు చెందిన కుటుంబాలు పాల్గొనగా, ఆలయం తరపున అన్నప్రసాదాల వినియోగం జరిగింది.

గోవిందా... గోవిందా

● పెరంబూర్ నుంచి 1,000 మంది తిరుమలకు పాదయాత్ర


తిరుమల పాదయాత్ర ప్రారంభిస్తున్న మోహనరావు, చిత్తూరి వాసుదేవన్

ప్యారీస్, ఫిబ్రవరి 11: గోవిందా... గోవిందా అన్న నామస్మరణతో శ్రీవారు భక్తులు తిరుమలకు పాదయాత్రగా బయల్దేరారు. పెరంబూర్ కందపిళ్లై వీధిలో ఉన్న శివవిష్ణు సేవార్థిగళ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యేటా శ్రీవారి భక్తులు తిరుమలకు పాదయాత్రగా స్వామివారిని దర్శించుకుంటారు. 43వ యేటా ట్రస్ట్ తరపున తిరుమల పాదయాత్ర ఆదివారం ఉదయం ప్రారంభమైంది. గురుస్వామి భక్తవత్సలం చేతుల మీదుగా గత జనవరి 3వ తేదీన తులసి మాలధారణతో ఉపవాసం చేపట్టిన 1,000మంది భక్తులు పాల్గొన్న పాదయాత్రను టీటీడీ స్థానిక సలహా మండలి సభ్యులు బి.మోహనరావు, ఎం.అశోక్‌కిషన్ ప్రారంభించారు. చిత్తూరు తిరుప్పావై ప్రవచనకర్త వూవే వాసుదేవన్ పాదయాత్ర వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు అలాగే, హైందవ సంస్కృతి విశిష్టత ప్రవచించారు. పాదయాత్రలో తమిళనాడు, ఆంధ్రరాష్ట్రాల్లోని పురాతన ఆలయాలు, ప్రసిద్ధిగాంచిన ఆలయాలను సందర్శించనున్నారు. ఈనెల 15వ తేది మెట్ల మార్గం ద్వారా తిరుమల కొండపైకి చేరుకొని స్వామివారిని దర్శించుకుంటారని ట్రస్ట్ సభ్యుడు పీవీ కృష్ణారావు తెలిపారు.


ప్రదర్శనకు పోటెత్తిన పర్యాటకులు - చెట్లు కాపాడుకుందాం... - ఉడుత నమూనా - డాగ్‌షో పాల్గొన్న శునకాలు - పూల చేప

ఆకట్టుకున్న పుదుచ్చేరి పుష్ప ప్రదర్శన

పుదుచ్చేరి, ఫిబ్రవరి 11: కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరి ప్రభుత్వ వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధ్వర్యంలో ఏర్పాటు చేసిన 34వ పుష్ప, కూరగాయలు, పండ్ల ప్రదర్శన ఆదివారం ముగిసింది. బొటానికల్ గార్డెన్‌లో రకరకాల పూలతో 125 స్టాళ్లతో కొలువుదీర్చిన ఈ ప్రదర్శనను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి శుక్రవారం ప్రారంభించారు. మూడు రోజులు సాగిన ఈ ప్రదర్శన స్థానికులు, పర్యాటకులను ఆకట్టుకుంది. పూలతో వివిధ జంతువుల ఆకారాలు, గుర్రాల రథం, శీతాకాలంలో పుష్పించే పూలరకాలు సువాసనలు వెదజల్లాయి. ప్రదర్శనలో భాగంగా ఆదివారం నిర్వహించిన డాగ్ షోలో జంతు ప్రేమికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అమృత ఇనిస్టిట్యూట్ విద్యార్థులకు బంగారు పతకాలు



పతక విజేతలకు సన్మాన కార్యక్రమం

అడయార్, ఫిబ్రవరి 11: జర్మనీలోని స్టుట్‌గార్ట్ వేదికగా జరిగిన ఐకేఏ కులినరీ ఒలంపిక్స్ పోటీల్లో చెన్నైకు చెందిన అమృత ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు మూడు బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. నాలుగేళ్లకు ఒకసారి ఈ తరహా పోటీలు నిర్వహిస్తుంటారు. ఈ యేడాది ఈనెల 2వ తేదీ నుంచి 7వ తేదీ మధ్య జరిగాయి. ఈ ఒలంపిక్స్‌లో సౌత్ ఇండియా చెఫ్ అసోసియేషన్ (ఎస్ఐసీఏ) తరపున చెన్నై, బెంగళూరు క్యాంపస్‌లకు చెందిన అమృత ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్లకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. వీరికి చెఫ్ కార్తీక్, సెంథిల్ ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఇందులో చెన్నై బ్రాంచ్‌కు చెందిన విద్యార్థులు మొత్తం పది పతకాలను గెలుచుకోగా, వీటిలో మూడు పతకాలున్నాయి. చెఫ్ శ్రేయ అనీష్ ఒక బంగారు, రెండు వెండి, చెఫ్ జగన్ శరవణ, చెఫ్ పునీత్ జోకప్ప బంగారు, వెండి పతకాలను గెలుచుకున్నారు. అలాగే, చెఫ్ అంకిత్ కాంతరాజు శెట్టి రెండు వెండి పతకాలు, చెఫ్ అకాష్ జార్జ్ ములంకుళియల్ కాంస్యం పతకాన్ని గెలుచుకున్నారు. ఈ పతక విజేతలకు నగరంలో సన్మాన కార్యక్రమం జరుగగా ఎస్ఐసీఏ చెఫ్ దాము, జనరల్ సెక్రటరీ శ్రీధరమ్ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రపంచ రికార్డు కోసం పళనిలో 1000మంది కళాకారులతో నృత్య ప్రదర్శన


సామూహిక నృత్య ప్రదర్శనలో పాల్గొన్న కళాకారిణులు

చెన్నై, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పళని పర్వతాలయం దిగువ గిరివీధిలోని అళగునాచ్చియప్పన్ ఆలయం వద్ద ప్రపంచ రికార్డు కోసం భరతనాట్య ప్రదర్శన జరిగింది. రాష్ట్రం నలమూలల నుంచి వచ్చిన వెయ్యిమంది కళాకారులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. స్థానిక శాసనసభ్యుడు సెంథిల్‌కుమార్ ఈ సామూహిక నృత్య ప్రదర్శనను ప్రారంభించారు. చతుషష్టి ఉపచారాలలో భగవంతుడి అనుగ్రహం పొందేరీతిలో పళని దండాయుధపాణి స్వామివారికి సుప్రభాతం, తిరుపుగళ్, కావడిసింధును ప్రధాన అంశాలుగా చేసుకుని నృత్యకళాకారిణులు నృత్యం చేశారు. సుమారు పావుగంటలకు పైగా సాగిన ఈ నృత్య ప్రదర్శన ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. నృత్య ప్రదర్శనలో పాల్గొన్నవారికి కలైమామణి మురళీధరన్ ప్రశంసాపత్రాలను అందజేశారు. సుందరేశగురుకుల్, రామలక్ష్మి తదితర నగర ప్రముఖులు ఈ కార్యక్రమ నిర్వహణ బాధ్యతలు చేపట్టారు.


చెన్నైలోని ముఖ్యమంత్రి నివాసగృహంలో తిరువికనగర్ డీఎంకే నాయకుడు ఇరా టిక్కా వివాహ వేడుకల్లో వధూవరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న సీఎం స్టాలిన్ సతీమణి దుర్గా స్టాలిన్, మంత్రి పీకే శేఖర్‌బాబు తదితరులు

ఆ రూ.1,000 కోట్లు ఖర్చు చేయండి

● రాష్ట్రప్రభుత్వానికి కేంద్రమంత్రి మురుగన్ సలహా

పెరంబూర్, ఫిబ్రవరి 11: రాష్ట్రప్రభుత్వానికి విపత్తుల నివారణ నిధుల నుంచి ఇదివరకే రూ.1,000 కోట్లను కేంద్రప్రభుత్వం అందజేసిందని, ఆ నిధులు వినియోగించుకోవాలని కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ సూచించారు. నగరంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... పార్లమెంటులో తాత్కాలిక బడ్జెట్ సమావేశాలు ముగిశాయన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నెలకొన్న ఆర్థిక పరిస్థితులను కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ చక్కగా వివరించారని తెలిపారు. పార్లమెంటులో డీఎంకే ఎంపీ టీఆర్ బాలు అనాగరికంగా వ్యవహరించారన్నారు. డీఎంకే ప్రభుత్వ పాలన ఎంత ఘోరంగా ఉందో కీలంబాక్కం బస్ టెర్మినల్ వ్యవహారం నిదర్శనమన్నారు. అక్కడ వసతులు, తగినన్ని బస్సులు కల్పించకుండా సత్వరం కోయంబేడు బస్ టెర్మినల్ నుంచి మార్చాల్సిన అవసరం ఎందుకో రాష్ట్రప్రభుత్వం తెలియజేయాలని మురుగన్ డిమాండ్ చేశారు.

పళవేర్కాడు తీరంలో 1200 తాబేలు గుడ్ల సేకరణ


పళవేర్కాడులో అటవీశాఖ అధికారులు సేకరించిన తాబేలు గుడ్లు, తీరానికి వస్తున్న తాబేళ్లు

చెన్నై, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళవేర్కాడు సముద్రతీరంలో అటవీశాఖ అధికారులు స్వచ్ఛంద సంస్థలతో కలిసి తాబేలు గుడ్ల సేకరణ పనులను చేపడుతున్నారు. ఇప్పటి వరకూ 1200 తాబేలు గుడ్లను సేకరించినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. యేటా నవంబర్ నుంచి ఏప్రిల్ వరకు తాబేళ్ల సముద్రతీరాల్లో గుడ్లు పెట్టడం ఆనవాయితీ. ఆ గుడ్ల నుండి రెండు మాసాల తర్వాత తాబేలు పిల్లలు పుడతాయి. ప్రస్తుతం చెన్నై, పళవేర్కాడు సముద్రతీరాల్లో తాబేళ్ల గుడ్లు పెడుతున్నాయి. ప్రస్తుతం సేకరించిన 1200 తాబేళు గుడ్లను భద్రపరిచామని, పిల్లలు పుట్టాక వాటిని సముద్రంలో విడిచిపెడతామని తెలిపారు. కాగా నెల రోజులుగా పళవేర్కాడు తీరంలో తాబేళ్ల కళేబరాలుగా కొట్టుకువస్తున్నాయని అటవీ శాఖ అధికారులు తెలిపారు. జాలర్లు విసిరిన వలలు, జాలర్ల పడవల వల్ల ఆ తాబేళ్లు మృతి చెంది ఉంటాయని భావిస్తున్నామన్నారు.

ఆండవన్ ఉత్తర్వుల పెట్టెలో వడ్లు


అద్దాల పెట్టెలో ఉంచిన వడ్లు

పెరంబూర్, ఫిబ్రవరి 11: తిరుప్పూర్ జిల్లా కాంగేయం సమీపంలోని శివన్‌మలై సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఆండవన్ ఉత్తర్వుల పెట్టె ఉంది. స్వామి భక్తుల కలలో కనిపించి సెలవిచ్చే వస్తువును ఈ ఉత్తర్వుల పెట్టెలో ఉంచి పూజిస్తుంటారు. పెట్టెలో ఉంచిన వస్తువు సమాజంలో మార్పులు సూచిస్తుందని భక్తుల నమ్మకం. ఈ క్రమంలో, స్వామి వారు ఓ భక్తుడు కలలో కనపడి సెలవిచ్చిన విధంగా గత ఏడాది అక్టోబరు 14న దూడతో ఉన్న ఆవు బొమ్మను ఉంచి పూజలు చేస్తున్నారు. తాజాగా, సేలం జిల్లా తారామంగళానికి చెందిన భక్తుడు మహారాజన్ కలలో స్వామివారు సెలవిచ్చిన విధంగా శనివారం నుంచి ఆండవన్ ఉత్తర్వుల పెట్టెలో వడ్లు ఉంచి పూజలు చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

కావేరి డెల్టాలో హైడ్రోకార్బన్ తవ్వకాలకు అనుమతి లేదు

● హైకోర్టుకు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం



చెన్నై, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కావేరి డెల్టా జిల్లాల్లో హైడ్రోకార్బన్ తవ్వకాలకు ఏ సంస్థకూ అనుమతి జారీ చేయలేదని మద్రాసు హైకోర్టుకు రాష్ట్రప్రభుత్వం స్పష్టం చేసింది. కావేరి డెల్టాలో హైడ్రోకార్బన్ తవ్వకాలను అడ్డుకునేలా స్టే జారీ చేయాలని కోరుతూ 2019లో మార్కస్ అనే వ్యక్తి మద్రాసు హైకోర్టులో ప్రజాహిత వాజ్యం దాఖలు చేశారు. ఆ పిటిషన్ ప్రధాన న్యాయమూర్తి గంగాపూర్‌వాలా, న్యాయమూర్తి భరత్ చక్రవరితో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. ఆ సందర్భంగా కేంద్ర పెట్రోలియం శాఖ కార్యదర్శి, వ్యవసాయ శాఖ కార్యదర్శి తరపున కౌంటర్ అఫిడవిట్లు దాఖలయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం అనుమతించకపోవడం వల్ల గతంలో హైడ్రోకార్బన్ తవ్వకాలు జరిగిన ప్రాంతాల్లో మళ్లీ తవ్వకాలు ప్రారంభించలేకపోయినట్లు ఆ కౌంటర్ అఫిడవిట్లలో పేర్కొన్నారు. అంతేకాకుండా 2020లో కావేరి డెల్టా జిల్లాలను సురక్షిత వ్యవసాయ క్షేత్రాలుగా ప్రకటించడంతో తవ్వకాలు పూర్తిగా ఆగిపోయాయని తెలిపారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున హాజరైన న్యాయవాదులు కూడా హైడ్రోకార్బన్ తవ్వకాలకు ఎలాంటి అనుమతి జారీ చేయలేదని పేర్కొన్నారు. ఈ వివరాలను నమోదు చేసుకున్న ధర్మాసనం హైడ్రోకార్బన్ తవ్వకాలు ఆగిపోవడంతో ఇక స్టే విధించే ఆస్కారమే లేకపోయిందని, కనుక ఈ కేసుకు ముక్తాయింపు పలుకుతున్నట్లు ప్రకటించింది.

దీరంపట్టిలో అట్టహాసంగా జల్లికట్టు



చెన్నై, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లా దీరంపట్టిలో ఆదివారం ఉదయం అట్టహాసంగా ప్రారంభమైన జల్లికట్టులో 600 ఎద్దులు రంకెలేశాయి. ఆ ఎద్దులను అణ చేందుకు సుమారు 300 మంది యువకులు పోటీపడ్డారు. దీరంపట్టిలోని సెయింట్ ఆంటోనియర్ సెబాస్టియన్ పొంగల్ వేడుకలను పురస్కరించుకుని ఈ పోటీలు జరిగాయి. ప్రత్యేక పూజల తర్వాత ఉదయం 8 గంటలకు వాడివాసల్ నుంచి కొమ్ములు తిరిగిన ఎద్దులు వరుసగా పరుగులు తీశాయి. ఆ ఎద్దులను అణచి బహుమతులు గెలుచుకునేందుకు యువకులు పోటీ పడ్డారు. తిరుచ్చి, మదురై, శివగంగ, పుదుకోట, దిండుగల్, కరూరు తదితర జిల్లాలకు చెందిన ఎద్దులు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ఈ జల్లికట్టులో యువతులు, మహిళలు పెంచిన ఎద్దులు మెరుపువేగంతో యువకులకు చిక్కకుండా పరుగులు తీసి బహుమతులు గెలుచుకున్నాయి. ఈ జల్లికట్టును చూడటానికి తిరుచ్చి జిల్లా నుంచే కాకుండా చుట్టుపక్కలి జిల్లాల నుంచి సుమారు రెండు వేలమంది తరలివచ్చారు. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు క్రీడా స్థలానికి చేరువగా ప్రత్యేక వైద్య బృందాలు, అంబులెన్స్‌ను సిద్ధంగా ఉంచి పకడ్బందీ ఏర్పాట్ల నడుమ నిర్వహించారు. ఎద్దులను అణచిన యువ వీరులకు స్టీలు బీరువాలు, మంచాలు, సైకిళ్లు, బంగారు, వెండి కాసులు, ప్లాస్టిక్ కుర్చీలను బహుమతులుగా అందజేశారు.


ఎద్దులను అణిచేందుకు ప్రయత్నిస్తున్న యువకులు